క్లుప్తంగా

జీజీహెచ్ పూర్తిస్థాయిలో ప్రజలకు ఉపయోగపడాలి

- భద్రత విషయంలో తగిన చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ దినేష్ కుమార్


జీజీహెచ్‌ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జీజీహెచ్ (సర్వజన ఆస్పత్రి) ప్రజలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడాలని ఆ మేరకు ఉన్న వనరులని ఉపయోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగంతో పాటు ఆర్థో, సైకియాట్రీ, న్యూరాలజీ, ఆప్తమాలజీ, తదితర సేవలపై ఆరా తీశారు. రిజిస్టర్‌లు తనిఖీ చేసి రోగులతో నేరుగా మాట్లాడి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీజీహెచ్‌లో భద్రత విషయంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో వైద్య కళాశాలను పరిశీలించి విద్యార్థులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, ఆర్ఎంఓ చైతన్య వర్మ, డిప్యూటీ ఆర్ఎంఓ అనిల్ ఇతర అధికారులు, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: టెలికం సేవలకు సంబంధించి కేంద్రీకృత హక్కుల ఆమోదాల కల్పనకు కేంద్రం ప్రారంభించిన గతిశక్తి సంచార పోర్టల్ వివరాలు, లక్ష్యాలు, తీసుకుంటున్న చర్యలు, సాధించిన పురోగతి, పొందిన ప్రయోజనాల గురించి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. కేంద్ర సమాచార శాఖ సహాయక శాఖామంత్రి దేవుసిన్హ చౌహాన్ సమాధానమిచ్చారు. దేశంలోని అన్ని ప్రాంతాల్లో బ్రాడ్ బ్యాండ్ సదుపాయ కల్పనను దృష్టిలో పెట్టుకుని 2022 మే 14న కేంద్రం గతిశక్తి సంచార పోర్టల్‌ను ప్రారంభించిందన్నారు. ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు, టవర్లు వేసేందుకు అనుమతులు పొందేందుకు టెలికం సేవలు, మౌలిక సదుపాయాలు, ఇంటర్నెట్ సేవలు సమకూర్చడం, ప్రొవైడర్లకు అన్ని విషయాలు తెలుసుకునేదానికి ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. టెలికం సదుపాయాలు త్వరగా విస్తరణకు సరైన మార్గాలు, అనుమతుల ప్రక్రియల ప్రణాళిక సాఫీగా అమలుచేయడం పోర్టల్ ప్రధాన లక్ష్యమన్నారు. అన్ని రాష్ట్రాల ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు, టవర్లు వేసేందుకు సంబంధించిన దరఖాస్తులు పంపేందుకు వీలు కల్పిస్తుందన్నారు. అన్ని చట్టాలు, సర్క్యులర్లు, మార్గదర్శకాలతో పాటు ఆమోదం పొందిన, పెండింగ్, నిరాకరించిన, తిప్పికొట్టిన దరఖాస్తుల స్థితిని అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, మంత్రిత్వ శాఖల వారీగా అమర్చిన డాష్‌బోర్డు ద్వారా తెలియజేయాలన్నారు. దరఖాస్తులను ఒకే ముఖం ద్వారా పంపే వీలు కల్పించడం జరిగిందని, దరఖాస్తుల అన్ని దశలను ఈమెయిల్, ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ చెల్లింపులు అనుమతించడం తదితర చర్యలు ఈ పోర్టల్ వల్ల సులభతరమై టెలికం సేవల్లో నాణ్యత, వేగం పెరుగుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.


ఒంగోలు గోపాల్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, తదితరులు


కాలేజీలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్ దంపతులు, జేసీ శ్రీనివాసులు దంపతులు, మేయర్ గంగాడ సుజాత, తదితరులు


చీమకుర్తిలో మొక్కలు నాటుతున్న ఎంఈఓలు

కాలుష్య రహిత నగరంగా ఒంగోలు

- జగనన్న హరితవనాలు కార్యక్రమంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న హరితవనాలు కార్యక్రమం ద్వారా ఒంగోలు నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. జగనన్న హరితవనాల కార్యక్రమంలో భాగంగా నగరంలోని గోపాలనగరంలో ఇటుకబట్టీల మార్గంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం బాలినేని ప్రారంభించారు. నగర మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు, అధికారులు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మీడియాతో బాలినేని మాట్లాడుతూ కాలుష్య రహిత నగరంగా ఒంగోలును తీర్చిదిద్దేందుకు లక్ష మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇది మానవాళికి ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి మొక్కలు నాటుకోవడంతో పాటు సంరక్షణ బాధ్యత వహించాలని కోరారు. కరోనా సమయంలో ఆక్సిజన్ ఆవశ్యకతను అందరూ గుర్తించారని, అందువలన చక్కని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఆగస్టు నెలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పాతిక వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు, తాగునీటి పథకంతో పాటు డెయిరీకి సంబంధించిన ప్రాజెక్టును కూడా సీఎం ప్రారంభిస్తారన్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి ఎల్‌అండ్‌టీకి కొంత బిల్లులు పెండింగ్‌లో ఉన్న అంశాన్ని చర్చించామన్నారు. పెండింగ్ బిల్లులను మూడు నుంచి నాలుగు రోజుల్లోనే చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 5వ డివిజన్ కార్పొరేటర్ ఎండేటి పద్మావతి రంగారావు, 6వ డివిజన్ కార్పొరేటర్ చల్లా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కలెక్టర్, జేసీ దంపతులు...

స్థానిక దామచర్ల ఆంజనేయులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, కేంద్రీయ విద్యాలయం, దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జేసీ శ్రీనివాసరావు, మేయర్ గంగాడ సుజాత, తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఒక్కరోజే 500 మొక్కలు నాటగా, లక్ష మొక్కలు నాటాలని నగరపాలక సంస్థ నిర్ణయించుకున్నట్లు కలెక్టర్, మేయర్ తెలిపారు. ఇప్పటికే ఎన్‌సీఏపీ నిధులు రూ.5 కోట్లతో నగరంలోని అన్ని పార్కులను సుందరీకరిస్తున్నట్లు చెప్పారు. ఒంగోలు నగరాన్ని కూడా హరితనగరంగా తీర్చిదిద్దడంలో ప్రజలంతా తమ వంతు కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, డీఈ, ఏఈ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం...

ఒంగోలు రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వివిధ పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత మండలంలోని సర్వేరెడ్డిపాలెం పాఠశాలలో శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, గ్రామ కార్యదర్శి రాంమోహన్‌రావు, పాఠశాల హెచ్ఎం, సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.

మొక్కలతో విద్యార్థులకు ఆరోగ్యం...

కొత్తపట్నం: పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం వలన కలుషితంలేని వాతావరణంలో విద్యార్థులు విద్యనభ్యసించవచ్చని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత అన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించాలన్నారు. అందులో భాగంగా కొత్తపట్నంలోని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పాలేటి సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాకాలంలో మొక్కలు నాటడం వలన చక్కగా బతికి చెట్లవుతాయని తెలిపారు. ఈ నెల నుంచే మొక్కలు నాటే ప్రక్రియ జరగాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం వలన పిల్లలకు చక్కటి స్వచ్ఛమైన గాలి వస్తుందని తెలిపారు. పాఠశాల చుట్టూ మొక్కలు నాటాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, ఎంఈవోలు జి.తులసికుమారి, టి.పద్మావతి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బీ నిడమానూరు పాఠశాలలో...

నాగులుప్పలపాడు: మండలంలోని బీ నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు రవి, రమణయ్య ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటినట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో ఐదు మొక్కల చొప్పున నాటారని, ఆ వివరాలను డీఈఓకు వాట్సాప్ చేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి: జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు శుక్రవారం చీమకుర్తి ఎస్ఎస్‌పీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓలు వెంకటేశ్వర్లు, శివాజీ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. వర్షాకాలంలో పాఠశాలల్లో మొక్కలు నాటడం వలన పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటాయని తెలిపారు. అందులో భాగంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులందరూ మొక్కలు నాటాలని ఎంఈఓలు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం జే యాకోబు, స్థానికులు పాల్గొన్నారు.


కొత్తపట్నం హైస్కూల్లో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో సుజాత, తదితరులు


జీ నిడమానూరులో మొక్కలు నాటిస్తున్న ఎంఈఓలు రవి, రమణయ్య, హైస్కూల్ సిబ్బంది


సర్వేరెడ్డిపాలెంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో, ఎంఈవో

పేదలకు అండగా ప్రభుత్వం

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు
- ఉప్పుగుండూరులో 3వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం


వృద్ధురాలికి ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్, వైఎస్సార్ సీపీ నాయకులు

నాగులుప్పలపాడు (మద్దిపాడు): పేదలు, బడుగు బలహీనవర్గాలకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలుస్తోందని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరులో శుక్రవారం 3వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న తన పరిపాలనలో పేద ప్రజలు ఉన్నతంగా ఎదగాలని ఆశించారని, అందుకు అనుగుణంగానే వారికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులకు పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని తెలిపారు. ప్రజలు కూడా అన్ని పథకాలు అందుతున్నాయని తెలుపుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలలో తనకు ఘనంగా స్వాగతం పలుకుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాలను గుండెల్లో ఉంచుకుంటారనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి జగనన్నపై సానుకూలంగా ఉండటం జీర్ణించుకోలేని చంద్రబాబు, ఆయన పుత్రరత్నం పచ్చపత్రికల ద్వారా విషం కక్కిస్తున్నారని విమర్శించారు. ముందుగా మూడోరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి బయలుదేరిన ఎమ్మెల్యేకి పలువురు నాయకులు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. దారిపొడవునా పూలు చల్లుతూ హారతులిస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారు బాబు, నాయకులు యల్లమందారెడ్డి, స్టేట్ డైరెక్టర్లు పేరాల చెన్నకేశవులు, కొలకలూరి విజయ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు కోయి హనుమయ్య, వాసుపంతులు, కిరణ్, ఇనగంటి రమణారెడ్డి, ముద్దన మహేశ్వరరావు, మున్నంగి శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కొమ్మూరి సుధాకర్, సన్నపురెడ్డి రమణమ్మ, ఎంపీడీవో జయమణి, గ్రామ సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ సభ్యులు మున్నంగి వెంకట్రావు, అనూరాధ, గ్రామ పార్టీ అధ్యక్షుడు మాదాసు రాంబాబు, కన్వీనర్లు కొణిజేటి సురేష్, నల్లూరి రాజా, కందుల డానియేల్, రాజు, మద్దిసాని రాజేష్, ప్రవీణ్, వజ్రంబాబు, మండలంలోని ముఖ్య నాయకులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సెల్ఫీలు తూచ్..!

- లోకేష్‌తో సెల్ఫీల కోసం ఎండలో నిలబడిన కార్యకర్తలు
- అర్ధంతరంగా ముగించడంతో ఆ మాత్రానికి సెల్ఫీ కార్యక్రమం ఎందుకంటూ రుసరుసలు

ఒంగోలు అర్బన్: యువగళం కార్యక్రమంలో భాగంగా లోకేష్‌తో ఏర్పాటు చేసిన సెల్ఫీల కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలకు నిరాశే మిగిలింది. ఎంతమందికైనా లోకేష్‌తో సెల్ఫీలు తీయిస్తామని స్థానిక నేత దామచర్ల జనార్దన్ టీడీపీ కార్యకర్తలకు ఇచ్చిన మాట లోకేష్ తీరుతో తూచ్ అయింది. యువగళం పాదయాత్రకు ప్రజలే కరువైతే సెల్ఫీల కోసం వచ్చిన కొద్దిమందిని కూడా సంతృప్తి పెట్టలేకపోయారు. కొద్దిమందితో మాత్రమే సెల్ఫీలు దిగిన నారా లోకేష్ అకస్మాత్తుగా వెళ్లిపోవడంతో ఆ కార్యక్రమం మధ్యలోనే నిలిచిపోయింది. సెల్ఫీల కోసం అప్పటివరకూ ఎండలో నిలబడి వేచి చూసిన కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు. ఈ మాత్రానికి సెల్ఫీల కార్యక్రమం ఎందుకంటూ రుసరుసలాడారు. సెల్ఫీలు లేని కార్యక్రమంలో క్యూలో తెలుగు తమ్ముళ్లు తోసుకుంటూ కొద్దిపాటి ఘర్షణ కూడా పడ్డారు. అక్కడే ఉన్న కానిస్టేబుల్ జోక్యంతో సద్దుమణిగింది. అనంతరం చేపట్టాల్సిన యువతతో ముఖాముఖి, రైతులతో సమావేశాలకు కూడా ఎవరూ రాకపోవడంతో కేవలం ఈవినింగ్ వాకింగ్‌లా చేసుకుంటూ వేగంగా నడుచుకుంటూ వెళ్లిపోయారు. కనీసం రోడ్డు పక్కన ఉన్న వారిని కూడా పలకరించిన దాఖలాలు లేవు. దీంతో ఇదేమి పాదయాత్ర అంటూ ప్రజలు ముక్కున వేలుసుకున్నారు.

డబ్బులిచ్చి.. జనాల్ని తెచ్చి...

ఒంగోలు సిటీ: నారా లోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేయడానికి టీడీపీ స్థానిక నాయకులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సాయంత్రం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర, అంతకుముందు సెల్ఫీల కార్యక్రమాలకు అద్దె జనాన్ని తరలిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. శుక్రవారం సాయంత్రం గుంటూరు రోడ్డులోని ఏ వన్ ఫంక్షన్ హాల్ నుంచి యాత్ర ప్రారంభమైంది. అంతకుముందే నగరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి డబ్బులిచ్చి వాహనాల్లో జనాలను తరలించారు. వచ్చిన వారు సైతం కొంత సేపు ఉండి మెల్లగా జారుకోవడం కనిపించింది. నగర శివారుకు చేరుకునే సరికి పార్టీ నాయకులు, భద్రతా సిబ్బంది హడావిడి తప్ప మరేమీ లేకుండా పోయింది.

మాటలు లేవ్.. మాట్లాడటాలు లేవ్..!

మద్దిపాడు/నాగులుప్పలపాడు: ఏనుగు వస్తుంది..భారీ శబ్దం చేస్తుందని ఎదురుచూసిన వారికి సుయ్ అని కూడా వినిపించలేదట. అదే విధంగా పాదయాత్రలో లోకేష్ మాట్లాడతాడని ఆశించిన నాయకులకు నిరాశే మిగిలింది. శుక్రవారం షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6.35 గంటలకు మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడులో స్థానికులతో సమావేశం, 8.35కు కొష్టాల సెంటర్‌లో పొగాకు రైతులతో సమావేశం 9.35కు మద్దిపాడులో స్థానికులతో సమావేశం, 10.35కు వెల్లంపల్లిలో మహిళలతో సమావేశం అనంతరం చివరిగా అర్ధరాత్రి 11.35కు గుండ్లాపల్లిలో ఫ్యాక్టరీల కార్మికులతో సమావేశం అంటూ ఉదయం నుంచి ఊదరగొట్టారు. కానీ, ఎక్కడా ఒక్క మాట కూడా లోకేష్ మాట్లాడకుండా వెళ్లిపోవడంతో అందరికీ నిరాశే మిగిలింది. ఏడుగుండ్లపాడులో దళిత కాలనీకి చెందిన యువకులు కొందరు లోకేష్‌కు తమ కాలనీ సమస్యలు చెప్పగా, వారిని ఆదుకుంటానని చెప్పినట్లు, ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిని తిట్టినట్లు, రాక్షసపాలన నడుస్తుందని చెప్పినట్లు పచ్చమీడియా ద్వారా ప్రచారం చేశారు. కొష్టాల సెంటర్‌లో కూడా రైతులతో మాట్లాడినట్లు ఎల్లో మీడియాలో రావడం ఆశ్చర్యం కలిగించింది. లోకేష్ ఆయా ప్రాంతాలకు చేరుకునే పది నిముషాల ముందే ఆయన మాట్లాడినట్లు రావడం కొసమెరుపు. అనంతరం మద్దిపాడులో చేతులూపుతూ లోకేష్ వెళ్లగా అక్కడ ప్రజలు కూడా నిరాశగా వెనుదిరిగారు. ఆ తర్వాత వెల్లంపల్లి సెంటర్‌లో జై ఎన్‌టీఆర్ అంటూ నినాదాలు చేసిన యువకుల మోటార్ సైకిళ్ల తాళాలు లాక్కున్న లోకేష్ అంగరక్షక వర్గం వారిని తమ కార్లలో బంధించి తీసుకెళ్లారు. ఫొటోలు తీసిన పలువురి మొబైళ్లు కూడా లాక్కెళ్లగా కొందరు మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు.

సంక్షిప్తంగా

అధిక లోడుతో వెళ్తున్న వాహనాలపై చర్యలు

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: రోడ్లపై అధిక లోడుతో వెళుతున్న వాహనాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రోడ్ల పక్కన ప్రజలకు తెలిసేలా తగు సూచన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి అక్కడ ప్రమాద సూచీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉప రవాణ కమిషనర్ సుశీల, ఏఎస్‌పి, ట్రాఫిక్ డీఎస్‌పీ, నేషనల్ హైవే అధికారులు, ఆర్‌టీసీ అధికారులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

చీమకుర్తి: మండల పరిషత్ నిధులు రూ.54 లక్షలతో మండలంలోని అయ్యపరాజుపాలెంలో సిమెంటు రోడ్డు, సైడు కాలువల నిర్మాణానికి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు చేతుల మీదుగా శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు స్వస్తి పలకాలి


మాట్లాడుతున్న పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ నరసింహరాజు

ఒంగోలు: ర్యాగింగ్ ఒక చెడు సంప్రదాయమని, దానికి యువతీ యువకులు స్వస్తిపలికి భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకోవాలని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎస్‌వీ నరసింహరాజు సూచించారు. శుక్రవారం స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన ర్యాగింగ్ వ్యతిరేక న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పర్మినెంట్ లోక్ అదాలత్ ఎలా పనిచేస్తుందనే దానిపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, కాలేజీ ప్రిన్సిపాల్ మూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌లో 9 సమస్యలు పరిష్కారం

మద్దిపాడు: మండలంలోని విద్యుత్ సమస్యలపై మద్దిపాడు విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో 9 సమస్యలను వెంటనే పరిష్కరించినట్లు ఇన్‌చార్జి ఏఈ రవిప్రకాష్ తెలిపారు. మొత్తం 27 సమస్యలపై అర్జీలు రాగా అధికారులు ప్రాధాన్యతా ప్రాతిపదికన పరిష్కరించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలపై నిర్వహించే విద్యుత్ అదాలత్‌లో ప్రజలు పాల్గొని తమ సమస్యలు తెలియజేసి అర్జీలిస్తే త్వరితగతిన పరిష్కరించడానికి అధికారులు ప్రయత్నిస్తారని డీఈఈ తెలిపారు. జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీజీ సత్యన్నారాయణ పర్యవేక్షణలో ఎస్ఏఓ కె.సుబ్బారావు, ఈఈ పి.శ్రీనివాసరావు, డీఈఈ ఆర్.మోహనరావు, ఏఓ చిన్నబాబు విద్యుత్ అదాలత్‌లో పాల్గొన్నారు.

మహిళల అక్రమ రవాణాపై అవగాహన అవసరం

ఒంగోలు: మహిళల అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగం, వాటివల్ల కలిగే అనర్థాలపై స్థానిక చెరువుకొమ్ముపాలెం పరిధిలోని తుఫాన్‌నగర్‌లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు పాల్గొని మాట్లాడారు. మహిళల అక్రమ రవాణా అనేది అత్యంత హేయమైన చర్యని అన్నారు. తల్లిదండ్రులు దీనిపై అవగాహన కలిగి ఉండాలని, అవసరమైతే పోలీసు సాయాన్ని పొందాలని సూచించారు. పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ నరసింహరాజు మాట్లాడుతూ పర్మినెంట్ లోక్ అదాలత్ విధివిధానాల గురించి వివరించారు. సచివాలయ సిబ్బంది, వీఆర్‌వో పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

కొత్తపట్నం: వ్యవసాయంలో మేలైన యాజమాన్య నూతన పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడి వచ్చి రైతుకు గిట్టుబాటు ధర, లాభాలు వస్తాయని ఆత్మ పీడీ, జిల్లా వనరుల కేంద్రం హెడ్ కె.అన్నపూర్ణ తెలిపారు. ఆత్మ ఫార్మర్ ఓరియెంటెడ్ పథకం 2023–24 కింద ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసే పంటల్లో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి మండలంలోని ఈతముక్కల, మోటుమాల రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. రైతులు సాగుచేసే పంటలను ఆశించే పురుగులు, తెగుళ్లు, వాటి నివారణకు పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, వ్యవసాయ శాఖ ఏవో మోహన్‌రెడ్డి, వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండాలి

మోటుమాల (కొత్తపట్నం): గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా మోటుమాలలో శుక్రవారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు.

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

చీమకుర్తి: ఒంగోలు కార్పొరేషన్ పేర్నమిట్టలోని 40వ డివిజన్‌లో బోరు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. తాగునీటి అవసరాల నిమిత్తం స్థానికుల విజ్ఞప్తి మేరకు బోరు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కత్తినేని విజయ్‌భరత్‌రెడ్డి, కత్తినేని శ్రీనివాసరెడ్డి, నూకతోటి ఈశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో విద్యార్థులకు వసతులు కల్పించాలి

- ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి


అధికారులతో చర్చిస్తున్న ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: మండల పరిధిలోని బీ నిడమానూరు, అమ్మనబ్రోలు గ్రామాల్లో గల సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో విద్యార్థులను చేర్చుకోవడం, వారికి వసతులు కల్పించడంపై మండల అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయమణి, తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎంఈఓలు రవి, రమణయ్య, ఏఎస్‌డబ్ల్యూ ఉదయశ్రీ, హాస్టల్ వార్డెన్లు లింగయ్య, ప్రభుదాస్ పాల్గొన్నారు.

